ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 27 ఫిబ్రవరి 2025






పొలతలలో ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

సర్వం శివమయం

జిల్లాలోని శైవక్షేత్రాలు ఓంనమఃశివాయ.. నామంతో మారుమోగాయి. బుధవారం తెల్లవారుజామునుంచే శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కొండలు కోనల్లో కొలువైన పరమశివుడి క్షేత్రాలకు భక్తులు పిల్లాపాపలతో పెద్ద ఎత్తున చేరుకున్నారు. దారి పొడవునా దాతలు భక్తులకు అన్నదానం చేశారు. పలువురు భక్తులు శివనామస్మరణతో రాత్రంతా జాగారం చేసి.. గురువారం ఉదయం కోనేటి స్నానమాచరించి స్వామిని దర్శించుకుని తిరుగుప్రయాణం కానున్నారు.





కిటకిటలాడిన పొలతల





పెండ్లిమర్రి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే ప్రముఖ శైవక్షేత్రం పొలతల మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామస్మరణతో మార్మోగింది. మంగళవారం నుంచే భక్తులు కొండపైకి చేరుకుని బుధవారం తెల్లవారుజామునే కోనేర్లలో స్నానాలు చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్కదేవతల ఆలయం వద్ద తడి బట్టలతో బిడ్డలు లేని, గాలిసోకిన స్ర్తీలు వరపడ్డారు. పులిబండెన్న స్వామికి మల్లేశ్వరుడి ఊరేగింపు తర్వాత మొక్కుబడులు ఉన్న భక్తులు జంతు బలులు సమర్పించారు. జిల్లాతో పాటు అనంతపురం, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం, కర్ణాటక నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

కమనీయం కల్యాణం

ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై పార్వతి, మల్లికార్జున స్వామి కల్యాణం పండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ కమనీయంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఆయన సతీమణి పుత్తా సరళమ్మ ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో కృష్ణా నాయక్, రాజారెడ్డి పర్యవేక్షించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా అధికారులతో పాటు పలువురు రాజకీయ నాయకులు, పోలీసు ఉన్నతాధికారులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో పొలతల మల్లికార్జున స్వామి

వైభవంగా ఊరేగింపు

కల్యాణం అనంతరం పార్వతీ సమేత మల్లికార్జున స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆలయ క్షేత్రంలో అక్కదేవతల గుడి వరకు బాణసంచా పేలుళ్లు, సంగీత నీరాజనాల నడుమ విశేషంగా తరలివచ్చిన భక్తుల సమక్షంలో ఊరేగంపు నిర్వహించారు.

అన్నప్రసాద వితరణ..

పొలతల క్షేత్రానికి వచ్చిన వేలాది భక్తులకు కాశిరెడ్డినాయన నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే ఆలయ పరిసరాల్లో దాతలతో పాటు దేవస్థానం తరుపున, దారిపొడవునా దాతలు అన్నదానంతో పాటు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కాగా.. పొలతలకు వెళ్లే మార్గంలో రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్ కావడంతో దుమ్ము, ఎండకు, తాగునీటికి భక్తులు చాలా ఇబ్బందులు పడ్డారు.



పొలతలలోని కోనేటిలో భక్తుల స్నానాలు..



కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

పేదలకు శుభవార్త

- ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఈ ఏడాది చివరి వరకు దరఖాస్తుకు గడువు

7

నిత్యపూజకోనలో..

సిద్దవటం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అటవీ ప్రాంతంలోని నిత్యపూజ కోనలో కొలువై ఉన్న నిత్యపూజేశ్వరుడు, పార్వతీదేవిల దర్శనానికి భక్తులు పోటెత్తారు. జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో పంచలింగాల గుడి వద్ద నుంచి కాలినడకన వెళ్లే మార్గంలో రద్దీ ఎక్కువై మధ్యాహ్నం దాదాపు రెండుగంటల పాటు రాకపోకలు ఆగిపోయాయి. మొక్కుబడులు తెచ్చేవారు మార్గమధ్యంలో ఇబ్బందులు పడ్డారు. కాగా.. మహాశివరాత్రి సందర్భంగా స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్రమణ్యంశర్మ, ఆలయ చైర్మన్ జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, ఎండోమెంట్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శివయ్య, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



దుప్పుపు: మల్లెంగుండం మహేశ్వరస్వామి దర్శనకోసం అడవిలో వెళుతున్న భక్తులు

లంకమలలో..

బద్వేలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం బద్వేలుకు సమీపంలోని లంకమల అభయారణ్యంలో ముక్తిరామలింగేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఇక్కడి క్షేత్రంలో భక్తులు జలపాతంలో స్నానమాచరించి భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. హర హర మహదేవ శంభోశంకర అంటూ దీక్షాపరులు శివనామస్మరణ చేశారు. లంకమలలోని ముక్తి రామలింగేశ్వరుని ఆలయం వద్దకు బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, సిబ్బంది గట్టి బందో బస్తు నిర్వహించారు. మల్లెంకొండలో భక్తులు శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అక్రమ నిర్మాణం తొలగింపులో వివాదం

- ఆక్రమణదారుడి హల్‌చల్
- ఎక్స్‌కవేటర్‌కు నిప్పు..
- ఆర్ఐపై దాడి..
- నిందితుడిపై హత్యాయత్నం కేసు

7



నిత్యపూజ కోనకు వెళ్లే కాలిబాటలో కిటకిటలాడుతున్న భక్తులు



బి.కోడూరు మండలం మున్నెల్లి గ్రామంలో పూజలందుకున్న 108 శివలింగాలు



లంకమలలో ముక్తిరామలింగేశ్వరుని దర్శనంకోసం వచ్చిన భక్తులు

పులివెందులలో భారీ అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- సుమారు రూ.66 లక్షల ఆస్తి నష్టం

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం మెయిన్‌బజారులోని చందు ప్లాస్టిక్ అండ్ జనరల్ స్టోర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. బాధతుల కథనం మేరకు.. జనరల్ స్టోర్‌లో బుధవారం ఉదయం రెండో అంతస్తు నుంచి పొగ రావడం గమనించి యజమాని చంద్రశేఖర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. దాదాపు ఐదు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. షాపులో ప్లాస్టిక్, తాళ్ల సామగ్రి ఉండడం వల్ల స్వల్ప వ్యవధిలోనే దుకాణం మొత్తం మంటలు చెలరేగాయి. రూ.20 లక్షల వస్తువులు, 20 తులాల బంగారం, రూ.30లక్షల నగదు కాలిపోయాయని.. దాదాపు రూ.66లక్షల ఆస్తి నష్టం జరిగిందని యజమాని చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు.



షాపులో నుంచి వస్తున్న మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బీటెక్ రవి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, మహబూబ్‌బాషా, నల్లగారి భాస్కర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించి

పరీక్షలు రాయాలి

- ఆర్ఐవో వెంకటసుబ్బారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడిని జయించి స్వేచ్ఛగా పరీక్షలు రాయాలని ఆర్ఐవో బండి వెంకటసుబ్బారెడ్డి సూచించారు. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే అధికారులు, సిబ్బందికి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి ఆయా అంశాలపై అవగాహన కలిగించామన్నారు. పిల్లలు శ్రద్ధగా చదివి, పరీక్షలు రాసేలా తల్లిదండ్రులు కూడా సహకరించాలన్నారు. జిల్లాలో 64 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 17,114 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,771 మంది హాజరుకానున్నారు. వీరిలో బాలికలు 17,851 మంది, బాలురు 15,034 మంది ఉన్నారు. ఉదయం 9గంటలలోపు పరీక్ష కేంద్రంలో ఉండాలన్నారు ఆలస్యమైతే లోనికి అనుమతి ఉండదని తెలిపారు. బ్యాగులు, సెల్‌ఫోన్లు, ఇతర పరికరాలు తీసుకురాకూడదన్నారు. కేవలం తాగునీటి సీసా, పరీక్ష అట్ట, పెన్నులు, పెన్సిళ్లు అనుమతిస్తారు. పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూము 08562 244171 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఆర్ఐవో సూచించారు.

కంటి ఆసుపత్రిని ప్రారంభించిన జగన్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో వైఎస్ రాజారెడ్డి కంటి ఆసుపత్రిని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం ప్రారంభించారు. ఇక్కడ ఎప్పటి నుంచో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఆసుపత్రి స్థానంలో ఎల్వీ ప్రసాద్ సంస్థ ద్వారా ఆధునికీకరణ చేసిన కంటి ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం ఆయన ఆసుపత్రి అంతా తిరిగి ఏర్పాట్లను పరిశీలించారు. కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ప్రముఖ ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, వైఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసుపత్రిని ఆధునీకరించామన్నారు. తక్కువ ఖర్చుతో అత్యాధునిక సౌకర్యాలతో ఇక్కడ కంటి వైద్యసేవలు అందుతాయన్నారు. పులివెందులలో కొన్ని దశాబ్దాలుగా రాజారెడ్డి ఆసుపత్రి సేవలు అందిస్తోంది. దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ఆసుపత్రిలోనే పనిచేసి రూపాయి వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. దీనిని ఇప్పుడు అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు. ఆసుపత్రి ప్రారంభించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు వైఎస్ జగన్ హెలికాప్టర్‌లో బెంగళూరుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీశ్‌కుమార్‌రెడ్డి, ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ ఎండీ గుండ్లపల్లె నాగేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ డాక్టర్ రాజా షర్మే తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ రాజారెడ్డి ఐ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించిన అనంతరం కంటి పరీక్షలు చేయించుకుంటున్న వైఎస్ జగన్

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



సికెదిన్నె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని వేపమానుసత్రం వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో జశ్రితరెడ్డి (8) అనే చిన్నారి మృతి చెందింది. పోలీ సుల వివరాల మేరకు.. మండలం లోని బానుపల్లెకు చెందిన వర్దిరెడ్డి జనార్ధన్‌రెడ్డి భార్య అరుణకుమారి, కుమార్తె జశ్రితరెడ్డి, కుమారుడు శ్రియాన్‌తేజ్‌రెడ్డి కలిసి బెంగుళూరు నుంచి మంగళవారం రాత్రి తన సొంత కారులో బయల్దేరి కడపకు వస్తున్నారు. అదే సమయంలో కడప నుంచి బెంగుళూరుకు వెళుతున్న కారు అతి వేగంతో రాంగ్ రూట్‌లో రావడంతో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జశ్రితారెడ్డి అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన జనార్ధన్‌రెడ్డి, అరుణకుమారి, తేజ్‌రెడ్డిలను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మరో కారులో ఉన్న సద్దాంహుస్సేన్, జహీర్‌లకు గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

పెన్నానదిలో పడి వ్యక్తి మృతి

చెన్నూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చెన్నూరుకు చెందిన మాకం వెంకటసుబ్బయ్య (35) అనే వ్యక్తి మద్యం మత్తులో బుధవారం మధ్యాహ్నం పెన్నానదిలో పడి మృతి చెందాడు. మద్యానికి బానిస అయిన వెంకటసుబ్బయ్య నిత్యం మద్యం సేవిస్తూ కుటుంబ సభ్యులను పెట్టేవాడు. దీంతో భార్య రెండే ళ్ల క్రితం ఇతన్ని వదిలి పిల్ల పాపలతో విజయవాడ వెళ్లింది. అలాగే తల్లిదండ్రులు సైతం కడప నగర పరిధిలో పాలెంప ల్లెలో నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో బుధవారం పెన్నా నదికి స్నానానికి వెళ్లిన వెంకటసుబ్బయ్య అక్కడ పొరపాటున నీటి గుంటలో పడి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

● రూ.లక్ష ఆస్తి నష్టం



కాలిపోయిన గృహోపకరణాలు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు కాలిపోవడంతో ఓ నిరుపేద కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. మండ లంలోని సంపతి కోట గ్రామానికి చెందిన గంగంపల్లె శివన్న ఓ నిరుపేద వ్యవ సాయ కూలీ. ఇతనికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. బుధవా రం శివన్న ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. టీవీ, ఫ్రిజ్, వంట పాత్రలు సహా వస్తువులన్నీ కాలి పోయాయి. ఈ ప్రమాదంలో రూ.లక్ష విలువైన ఆస్తి నష్టపోయి నట్లు అంచనా వేశామని, ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామని వీఆర్వో నరేంద్ర తెలిపారు. తక్షణ సాయంగా ఆ కుటుంబానికి ఒక్క బియ్యం ప్యాకెట్‌తో పాటు నిత్యావసర సరుకు లు అందించారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ సంపతికోట కిట్ట న్న బియ్యం ప్యాకెట్‌తో పాటు, రూ.5వేలు అందించి మాన వ త్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎం. చిన్నరెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి



నిమ్మనపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై తిప్పేస్వామి తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాచవేటి వారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లికి చెందిన చంద్రారెడ్డి ఇటుకల ఫ్యాక్టరీలో ఒరిస్సాకు చెందిన పోదన్(29) పని చేస్తున్నాడు. బుధవారం డ్రైవర్ దీపక్‌తో కలసి ఇటుకలను బోయ కొండలో అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా బోయకొండ ఆర్చి వద్ద వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పోదన్ ట్రాక్టరులో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ దీపక్ తప్పించుని పారిపోయాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీఈసీ సభ్యుడు శివహరిప్రసాద్ రెడ్డి మృతి



శివహరిప్రసాద్‌రెడ్డి(ఫైల్)

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీ (డీఈసీ) సభ్యుడు ఎస్.శివహరి ప్రసాద్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందినట్లు డీఈసీ కన్వీనర్ ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి పట్ల ఆర్జేడీ రవితో పాటు డీఈసీ సభ్యులు, అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అక్రమ నిర్మాణం తొలగింపులో వివాదం

● ఆక్రమణదారుడి హల్‌చల్

● ఎక్స్‌కవేటర్‌కు నిప్పు..

● ఆర్ఐపై దాడి.. పరుగులు తీసిన ఆర్ఐ, వీఆర్వో

● నిందితుడిపై హత్యాయత్నం కేసు



దేవతానగర్‌లో ఆక్రమణను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు, ఆక్రమణదారుడు చలపతి నిప్పు పెట్టడంతో కాలిపోయిన ఎక్స్‌కవేటర్ సీట్లు

మదనపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన అధికారులపై ఆక్రమణదారుడు దాడి చేయడంతో పాటు, ఎక్స్‌కవేటర్‌కు నిప్పు పెట్టాడు. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ దేవతానగర్‌లోని సర్వేనంబర్ 1029లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గిరిజన నాయకుడు చలపతి ఆక్రమించాడని, అందులో ఇల్లు నిర్మిస్తున్నాడంటూ స్థానికులు సబ్‌కలెక్టర్, రెవెన్యూ అధికారులకు వీడియో, ఫొటోలతో ఫిర్యాదు చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న సబ్‌కలెక్టర్. ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్ ధనంజయులును ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో ప్రసాద్, ఆర్ఐ శేషాద్రిరావు బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో దేవతానగర్‌కు చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న ఆక్రమణదారుడు అడ్డుకున్నాడు. రెవెన్యూ అధికారులు వెనక్కు తగ్గకపోవడంతో ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌పై దాడికి పాల్పడగా, భయాందోళనకు గురైన డ్రైవర్ వాహనం దిగి పరుగులు పెట్టాడు. దీంతో ఎక్స్‌కవేటర్‌కు నిప్పంటించి అద్దాలు పగులగొట్టాడు. అతడి ఆగడాలను చిత్రీకరిస్తున్న ఆర్ఐ శేషాద్రిరావును దూషిస్తూ సెల్‌ఫోన్ లాక్కుని కర్రతో దాడి చేశాడు. ఊహించని పరిణామంతో ఆర్ఐ, వీఆర్వోలు అక్కడి నుంచి పరుగులు తీశారు. ఆర్ఐపై జరిగిన దాడి గురించి తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడున్న స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అప్పటికే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. వీఆర్వో ఫిర్యాదు మేరకు నిందితుడు చలపతితో పాటు మరికొందరిపై హత్యాయత్నం, మరో ఐదు సెక్షన్ల కింద తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేశారు.





సంఘటన స్థలంలో ఆర్ఐ శేషాద్రిరావును విచారిస్తున్న తాలూకా సీఐ కళా వెంకటరమణ, నిందితుడు చలపతి (ఫైల్‌ఫొటో)

కలెక్టర్ సీరియస్

ఆర్ఐపై జరిగిన దాడి, హత్యాయత్నం నేపథ్యంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ సీరియస్ అయ్యారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు సూచించారు. రెవెన్యూ ఉద్యోగులపై దాడికి ప్రయత్నిస్తే పరిణామాలు ఎలా ఉంటాయో చెప్పే విధంగా చర్యలు ఉండాలని సూచించినట్లు తెలిసింది. మరోవైపు నిందితుడి ఆక్రమణల వ్యవహారంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు.

భూకబ్జాదారునిపై రెవెన్యూ కొరడా

మదనపల్లె పట్టణం గొల్లపల్లె క్రాస్‌కు చెందిన చలపతిపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. స్థానిక దేవతానగర్‌లో ఆక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై దాడి సంఘటనతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఇందులోభాగంగా నిందితుడు ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమించాడో విచారణ చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ తహసీల్దార్ ధనంజయులును ఆదేశించారు. ఇందులో భాగంగా దేవతానగర్‌తో పాటు సీటీఎం క్రాస్ రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ (కోమటివాని చెరువు ఆనుకుని), అమ్మచెరువుమిట్ట, తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టాడని రెవెన్యూ సిబ్బంది ప్రాథమికంగా గుర్తించి నివేదిక ఇచ్చారు. దీనిపై ఏరియాల వారీగా వీఆర్వోలతో టీమ్‌లు ఏర్పాటు చేసి తొలగించాలని సూచించారు. ఇందులో భాగంగా అమ్మచెరువుమిట్ట వద్ద నిర్మించిన రేకుల షెడ్డును ఒక టీం ఎక్స్‌వేటర్‌తో తొలగించింది. సీటీఎం క్రాస్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న పునాదిని తొలగించి, అక్కడ నిర్మాణానికి సిద్ధం చేసిన ఇసుక, ఇతర సామగ్రిని మరో బృందం తొలగించింది. అలాగే సీటీఎం క్రాస్ రోడ్డులోని అంగళ్ల రోడ్డులో మరో భవనాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చినట్లు గుర్తించారు.

దీనిని తొలగించడానికి వీఆర్వో బృందం వెళ్లగా అందులో అద్దెకు ఉన్న వ్యక్తి..గురువారం ఉదయం 10 గంటల వరకు గడవు ఇస్తే ఇంటిని ఖాళీ చేస్తానని చెప్పినట్లు తెలిసింది. మరోవైపు ఎస్‌బీఐ కాలనీతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో చేపట్టిన ఆక్రమణలు తొలగించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా వుండగా, దేవతానగర్‌లోని సర్వే నెంబర్.1029లో ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి నిర్మాణం చేస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. దీనిపై కోర్టుకు వెళ్లిన ఆ వ్యక్తి రెవెన్యూ అధికారులు ప్రవేశించకుండా స్టే తెచ్చుకున్నాడు. అయితే అదే స్థలానికి ఆనుకుని ఉన్న ఖాళీ జాగాలో చలపతి నిర్మాణం చేపట్టాడు. దీనిని అడ్డుకుని తొలగించే క్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుంది.

ఎనిమిది సెక్షన్ల కింద కేసు నమోదు

మదనపల్లె దేవతానగర్‌లో అక్రమణ నిర్మాణదారుడు చలపతి, అతడి అనుచరులపై బుధవారం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించే క్రమంలో బసినికొండ వీఆర్వో జె.ప్రసాద్, ఎక్స్‌వేటర్ డ్రైవర్ రెడ్డెప్ప, ఆర్ఐ శేషాద్రిరావులపై దాడి ఘటన నేపథ్యంలో వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎనిమిది సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నెం:54-2025 కింద కేసు నమోదు చేశారు. ఇందులో బీఎన్ఎస్ సెక్షన్లు 329 (3), 324 (4), 109 (1), 132, 326 (ఎఫ్), 351 (2), 118 (1) రెడ్‌విత్ 3 (5) ఉన్నాయి. హత్యాయత్నం, ప్రభుత్వ భూమి ఆక్రమణ, ప్రభుత్వ ఆస్తి ధ్వంసం (నష్టపరచడం) ఎక్స్‌కవేటర్‌కు నిప్పు పెట్టడం, కర్రలు, కత్తులతో ఉద్యోగులపై దాడి చేయడం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, తదితర అంశాలపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

నిత్యపూజయ్యా.. నీ లీలలు ఎక్కడయ్యా...!

● శివభక్తులకు తప్పని ఇబ్బందులు ● అడుగడుగునా ట్రాఫిక్ జామ్



కాలినడకన అటవీ ప్రాంతంలో నిలిచిపోయిన భక్తుల రాకపోకలు

సిద్దవటం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భం గా 'నిత్యపూజయ్యా..! నీ లీలలు ఎక్కడయ్యా!!' అంటూ నిత్యపూజయ్య కోనకు వెళ్లే భక్తులు నిట్టూర్పు విడిచారు. మండలంలోని నిత్యపూజేశ్వర శివరాత్రి మహోత్సవాల సందర్భంగా శివపార్వతుల దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి బుధవారం భక్తులు పోటెత్తారు. పంచలింగాల గుడి నుంచి కాలినడకన శివపార్వతుల దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గమధ్యంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 వరకు రాకపోకలు నిలిచిపోయాయి. తగు జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు.

సన్నిదానంలో గర్భగుడి వద్ద భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో గంటల తరబడి నిలిచిపోయారు. దీంతో స్వామివారికి మొక్కుబడులు తెచ్చేవారికి మార్గమధ్యంలో ఇబ్బందులు తలెత్తాయి. మార్గమధ్యంలో రెండో ముఖద్వారం ఆశ్రమం నుంచి పంచలింగాల గుడి వరకు ఏర్పాటు చేసిన రహదారిపై దుమ్ము ఎగిసి పడడంతో భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పంచలింగాల గుడి నుంచి సన్నిదానం వరకు అడుగడుగునా భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి.



నిత్యపూజకోనకు వెళ్లే రహదారిలో దుమ్ము

గండ్లూరు రామాలయంలో చోరీ

కొండాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్లూరు రామాలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తలుపులు పగులగొట్టి.. ఆలయంలోని బీరువాలో ఉంచిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు చెందిన నాలుగు వెండికిరీటాలను చోరీ చేసినట్లు ఆలయ నిర్వాహకుడు పి.సుబ్బారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 900 గ్రాములు వుండే వీటి విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని తెలిపారు. కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించి... క్లూస్ టీం బృందంతో వివరాలను సేకరించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు గాజులు, నగదు అపహరణ

సుండుపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దినేనికాలువ గ్రామపంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన డీలర్ కరుణ తన రెండు బంగారు గాజులు, రూ.20వేలు నగదు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సుండుపల్లెకు సమావేశానికి వచ్చిన సమయంలో ఈ దొంగతనం జరిగినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మతి స్థిమితం లేని యువకుడు తల్లిదండ్రులపై కత్తితో దాడి

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం బలిజపల్లె పూసలకాలనీలో బుధవారం తెల్లవారుజామున మతి స్థిమితం లేని యువకుడు తన తల్లిదండ్రులపై కత్తితో దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా... ప్రేమసాయికి భార్యతో పాటు ఇరువురు పిల్లలున్నారు. అతని వేధింపులు తాళలేక భార్య చాలరోజల కింద టపుట్టింటికి వెళ్లిపోయింది.

ఈ నేపథ్యంలో ప్రేమసాయి తన కుమారుని తెల్లవారుజామున బయటకు తీసుకెళుతుండగా ఏమైనా చేస్తాడేమోనని అతన్ని తల్లిదండ్రులు అడ్డుకున్నారు. దీంతో మానసిక స్థితి సరిగా లేని ప్రేమసాయి తన జేబులోని పిడుబాకుతో తండ్రి శ్రీరాములు, తల్లి నాగమ్మల వీపు, పొట్టపై కత్తితో దాడి చేయడంతో తీవ్రగాయలయ్యాయి.దీంతో వెంటనే వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ప్రేమసాయిని రాజంపేట పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.



దాడిలో తీవ్రంగా గాయపడిన నాగమ్మ



ప్రేమసాయి (ఫైల్ ఫొటో)

పేదలకు శుభవార్త

● ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

● ఈ ఏడాది చివరి వరకు దరఖాస్తుకు గడువు



కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఆక్రమించు కుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అలాంటి గృహాలను క్రమబద్ధీకరించేందుకు జీవో నెంబరు 30 జారీ చేస్తూ మార్గదర్శకాలను జారీ చేసింది. ఇన్నాళ్లు ఆక్రమణల పేరుతో పేదల నివాసాలను కూల్చి వేస్తుండటంతో వారు జీవితాంతం కష్టపడి పైసా పైసా కూడబెట్టుకున్న సొమ్ము మట్టిపాలు అవుతోంది. దీనిని గుర్తించిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ భూముల్లో గృహాలు ఏర్పాటు చేసుకున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలంటూ ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో పేదల ఆర్థిక స్థితిని బట్టి అంచనాలు వేస్తూ కూటమి సర్కారు వంకలు, వాగులు, చెరువుల్లో ఆక్రమణలు కాకుండా.. అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన నిర్మాణాల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది.

నిబంధనలు ఇలా..

2019 సంవత్సరానికి ముందు నిర్మించుకున్న గృహాలు, భూములు క్రమబద్ధీకరణ జరిగేలా 2019 అక్టోబరు 15 కటాఫ్ డేట్ విధించింది. నిబంధనలు అనుసరించి అర్హతలు ఉంటే ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేస్తూ మహిళల పేరుపై పట్టాలివ్వనుంది. తహశీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది అక్రమ నిర్మాణాలను గుర్తించనున్నారు. ఈ జాబితాలో అభ్యంతరాల స్వీకరణ, సబ్ డివిజన్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అనంతరం అర్హులకు ఇళ్ల పట్టాలు అందనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పన్ను చెల్లింపుదారులు, నాలుగు చక్రాల వాహన దారులు ఈపథకానికి అర్హులు కారు. వ్యవసాయ పనులకు ఉపయోగించే ట్రాక్టర్లు, ట్యాక్సీ, ఆటోలకు మాత్రం మినహాయింపు ఇవ్వనున్నారు. లబ్ధిదారులకు కన్వెన్షన్ డీడ్ అందజేసిన రెండేళ్ల తరువాత యాజమాన్య హక్కులు కల్పించేలా ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది.

ఫీజులు ఇలా..

క్రమబద్ధీకరణకు సంబంధించి 150 గజాల స్థలం వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించనక్కర లేదు. 151-300 గజాల వరకు రిజిస్టర్ ఫీజులో నిరుపేదలు 15 శాతం, పేదరికానికి ఎగువనున్న వర్గాలు 50 శాతం చెల్లించాలి. 301-450 వరకు బీపీఎల్ వర్గాలు ప్రాథమిక విలువ ప్రకారం 100 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలి. ఏపీఎల్ వర్గం వారు ప్రాథమిక విలువలో 200 శాతం చెల్లించాలి. 451 గజాల నుంచి ఆపై ఆక్రమించిన నిర్మాణాలకు బీపీఎల్, ఏపీఎల్‌తో సంబంధం లేకుండా నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా తొలగించేలా తాజాగా విడుదల జేసిన జీవోలో పొందుపరిచారు. ఈమేరకు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు.

'వక్ఫ్ సవరణ చట్టం రద్దుకు తీర్మానం చేయాలి'

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టం-2024 అమలు చేయబోమని శాసన సభలో తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలీఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి ముఖ్యమంత్రికి రాసిన బహిరంగ లేఖను నివేదించి విడుదల చేశారు. మాజీ కార్పొరేటర్ రంతుల్లా ఖాన్, హమీద్, దినకర్‌రెడ్డి, కమాల్ బాష, జహరార్, మైనుద్దీన్ పాల్గొన్నారు.

కడప ఉక్కుకు నిధులు కేటాయించాలి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కడప ఉక్కుకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో నిధులు కేటాయించి పరిశ్రమ ప్రారంభానికి చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. జిల్లా సహాయ కార్యదర్శి ఆదల్, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

పొలతలలో అన్నదానం

కడప కల్చరల్, ఫిబ్రవరి 26, (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పొలతల శ్రీమల్లేశ్వరుని సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పొలతల క్షేత్రంలో పొలతల మల్లీశ్వరస్వామి రజక సేవా సమితి అధ్యక్షుడు ఎం. మల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. 21 సంవత్సరాలు గా పొలతల క్షేత్రంలో శివరాత్రి సందర్భం గా భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో సమితి నాయకులు సి. కొండయ్య, శివశంకర్, రెడ్డయ్య హనుమంతు, సుబ్బరాయుడు హరిబాబు, సి.మల్లేష్, తదితరులున్నారు.

చంద్ర కుటుంబ సభ్యులకు మేయర్ పరామర్శ

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్ర అనారోగ్యంతో మృతిచెందారు. విష యం తెలుసుకొని కడప నగర మేయర్ సురేష్‌బాబు బుధవారం కడప నగరం లోని ఆయన ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కిరణ్,నాయకులు శివకేశవ, వర్క్ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ప్రసాద్, ఖాదర్, నగరపాలక సంస్థ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

కాశీ విశాలాక్షికి సారె సమర్పణ

చెన్నూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశిగా వెలుగొందే కాశీవిశ్వేశ్వరాలయంలో కొలువై ఉన్న విశాలాక్షి అమ్మవారికి మహాశివరాత్రి సందర్భంగా శివాలపల్లె మహిళలు ఇంటింటి నుంచి అమ్మవారికి సారె తీసుకువచ్చి సమర్పించారు. మంగళవాయిద్యాలు, బాణసంచాతో మహిళలు పసుపు కుంకుమ, పిండి వంటలు, పూలు పండ్లు సారెతో అమ్మవారి ఆలయానికి గ్రామం నుంచి నడుచుకుంటూ వచ్చి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పురోహితులు సారెను అమ్మవారికి అందించారు.

తెలుగు భాష తేజరిల్లాలి

వల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా వికాసం, మహిళా చైతన్య స్ఫూర్తి ప్రజల్లో నింపేందుకుతెలుగు సంస్కృతి సాహితీ యాత్రలో మహాకవయిత్రి మొల్ల జయంతి ఉత్సవాలు జిల్లావ్యాప్తం గా నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంత రావు అన్నారు. బుధవారం వల్లభాపురం లోని ప్రాచీన శివాలయాల్లో సంబంధించిన బ్యానరును ఆవిష్కరించారు. ఈ యాత్రలు మార్చి 13వతేదీతో ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ మూర్తి, ఎంఎల్ఎన్ శర్మ, సుచరిత, చంద్రశేఖర్, దీపక్ దీక్షిత్, నాగరాజశర్మ, హర్ష, పవన్ సాయి, సతీష్ పాల్గొన్నారు.

వైభవంగా శివరాత్రి వేడుకలు



పొలతలకు మల్లేశ్వరుడి దర్శనానికి విచ్చేసిన భక్తులు

కడప కల్చరల్ ఫిబ్రవరి 26, (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా పొలతల, నిత్యపూజకోన, కన్యతీర్థం, భైరవకోన, హత్యరాల, లంకమల తదితర అటవీప్రాంతాలు పులకించాయి. శైవక్షేత్రాలకు చేరుకునే భక్తుల సౌకర్యార్థం జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంది. స్వామివారి భక్తులకు దాతలు అన్నదానం, మంచినీరు, మజ్జిగ, తదితర వాటిని పంపిణీచేశారు. శైవక్షేత్రాలకు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ అధికారులు కడప రీజనల్ పరిధిలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కాగా కడప నగరంలోని శివాలయాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మృత్యుంజకుంటలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ఆది దంపతుల కల్యాణం కనులపండువగా జరిగింది. కాగా నగర గడ్డిబజార్‌లో వెలసిన రాజరాజేశ్వరీదేవి ఆలయంలో కాశీ విశ్వేశ్వర స్వామికి అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే దేవుని కడపలో వెలసిన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ పార్వతులను ప్రత్యేక అలంకారం చేశారు. అదే విధంగా మోచంపేట శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు,అభిషేకం నిర్వహించారు. శివ పార్వతులను జిల్లా జడ్జి శ్రీదేవి దంపతులు దర్శించుకున్నారు.

చెన్నూరు..: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా దక్షిణ కాశీగా వెలుగొందుతున్న శివాలపల్లె కాశీవిశ్వేశ్వరాలయంలో విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరుని కల్యాణం కనులపండువగా జరిగింది. ఉదయం 8.30గంటలకు ప్రారంభమైన కల్యాణోత్సవం మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేద పండితుల ఆధ్వర్యం లో నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో మహాశివునికి ప్రత్యేక అభిషేకాలతో పాటు అర్ధరాత్రి 12గంటల సమయంలో లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు జరిగా యి. అలాగే పెన్నాతీరంలో కొలువైన దాక్షాయణి సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం పుష్పయాగం, సహస్ర దీపాలంకరణసేవ, నందిసేవతో పాటు రాత్రికి భగన్నామ సంకీర్తన, లింగోద్భవ అభిషేకాలు నిర్వహించగా ప్రత్యేకంగా మూలవిరాట్‌మూర్తికి అర్ధనారీశ్వర అలంకారం చేశారు. అలాగే ఆర్అండ్‌బీరోడ్డులోని నాగేశ్వర ఆలయంలో మూలవిరాట్‌మూర్తికి అభిషేకాలతో పాటు సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.అలాగే ఉప్పరపల్లెలోని నాగలింగేశ్వరాలయం, కొండపేట ఉమామహేశ్వరాలయం, రామనపల్లె గిరిజా మల్లేశ్వరాలయం, బలసింగాయపల్లె సిద్ధలింగేశ్వరాలయంలో విశేష పూజలు,అభిషేకాలు, అలంకారాలుగావించారు.

వల్లూరు..: శివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని శివాలయాలకు భక్తులకు తరలివెళ్లారు. ముఖ్యంగా పుష్పగిరిలో ఉన్న వైద్యనాథేశ్వ రున్ని, కామాక్షి అమ్మవారిని, కొండపైన సంతాన మల్లేశ్వరున్ని దర్శించుకున్నారు. పంచమ నదిలో పుణ్యస్నానాలాచరించి ముందుగా శివపార్వతులను దర్శనం చేసుకున్నారు. కొండపైన ఉన్న రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవుల సంతాన మల్లేశ్వరున్ని దర్శించుకున్నారు. అలాగే వల్లూరు, గంగాయపల్లె భవానీ శంకర ఆలయం లో పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణ క్రతువును పూర్తి చేశారు. భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాలను కార్యనిర్వాహకులు అందించారు. పుష్పగిరిలో సాయంత్రం కామాక్షి సమేత వైద్యనాథేశ్వరుని కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు.

సింహాద్రిపురం..: భానుకోటలో భక్తులు చేసిన శివనామ స్మరణతో కోట మారుమ్రోగింది. తెల్లవారుజామున నుంచి శివపార్వతులకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరిం చారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు నిర్వాహ కులు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండుగలా నిర్వహించారు. కాగా భానుకోటలో పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆయనతో పాటు సీఐ రమణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: శివరాత్రి సందర్భంగా సంబటూరు, కమలాపురం తదితర శివాలయాల్లో శివ పార్వతుల కల్యాణం నిర్వహకులు వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పులివెందుల టౌన్..: పులివెందుల పట్టణంలో శివాలయాలు భక్తుల శివనామస్మ రణలతో మారుమ్రోగాయి. పట్టణంలోని మిట్ట మల్లేశ్వరస్వామి ఆలయంలో అలాగే మోటున్నూతలపల్లెలో వెలసిన కోనగంగేశ్వర స్వామి ఆలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సికెదిన్నె..: చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లెలోని ఉమామహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

బండలాగుడు పోటీలు..: బుగ్గమల్లేశ్వరాలయంలో బండలాగుడు పోటీలను నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. అదే విధంగా మండలంలోని ఊటుకూరు కృష్ణాలయం, పెద్దగాడి మల్లేశ్వరస్వామి ఆలయం, ఇతర ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు.

వేంపల్లె..: వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన గవిమల్లేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహించారు. పాతపేటలోని భవాని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

వీరపునాయునిపల్లె..: మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో పావని, పాపాఘ్ని, మొగమోరు నదుల మధ్య ఉన్న సంగమేశ్వ రాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మాజీచైర్మన్ నర్రెడ్డి మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, ఎస్‌వీఆర్ఎస్ఎం బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ బాల్నేనిరాజేష్, వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఒంటిగారి సుధీర్, సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత ఒంటిగారి వెంకటసుబ్బానాయుడు, ఆలయ మాజీ చైర్మన్ రెడ్డి మురళీమోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాగాకాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డిసంగమేశ్వరాలయాన్ని దర్శించారు. ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు అలాగే సంగమే శ్వరస్వామిని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఎంపీపీ ప్రసాదరెడ్డి, ఇందు కూరు నాగార్జునరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా కాంట్రాక్టర్‌రెడ్డి బ్రహ్మానందరెడ్డి, సీడ్ కడప శిరిడి సాయి ఎలక్ట్రికల్ ఎండీ విశ్వేశ్వర్‌రెడ్డి, చిన్నపిల్లల డాక్టర్ కరుణాకర్‌రెడ్డి దాతృతంతో ప్రతి ఏడాది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేస్తూ వస్తున్నారు. ఆలయ మాజీ చైర్మన్ రెడ్డి మురళీమోహన్‌రెడ్డి, కార్యనిర్వాహకులు వర్దిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగాల..: మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పార్నపల్లె కోనమల్లేశ్వర ఆలయం, లింగాల వనంబావి సిద్ధలింగేశ్వరాలయం, బోనాల చిన్నబావి శివాలయం, అంబకపల్లె నూతికోనసిద్ధేశ్వరాలయంలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

చక్రాయపేట..: వేంకటేశ్వర, రాచరాయ ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు జరిగాయి. దేవస్థానంలో ఒకేవేదికపై శివపార్వతులు, లక్ష్మీవేంకటేశ్వర స్వాములకు కల్యాణం నిర్వహించారు. ఆలయం ఆవరణంలోనే పాఠశాల విద్యార్థులు కోలాటాలు, నృత్యాలు చేపట్టారు. అనంతరం ఒంగోలు జాతికి ఎద్దులు బండలాగుడు పోటీలు ఆలయ చైర్మన్ రామాంజనేయరెడ్డి, చక్రపాణిరెడ్డి, సభ్యులు ప్రారంభించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులను అందించారు.

పులివెందుల రూరల్..: శివరాత్రి సందర్భంగా మండలంలోని నామాలగుండు సిద్ధలింగేశ్వర ఆలయం, మోట్నూతలపల్లె గవేశ్వర ఆలయం, గుండాలయ్య కోనలోని మల్లికార్జునుడు, పంచలింగాలకోనలో శివునికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అలాగే పులివెందుల పట్టణంలోని మిట్టమల్లేశ్వర ఆలయం, ఉమామహేశ్వర ఆలయం, పలు శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేపూజలు నిర్వహించారు.




వీరపునాయునిపల్లెలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి



పులివెందుల కోనగంగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బీటెక్ రవి



సీకే దిన్నె.. బయనపల్లెలో ఉమామహేశ్వరస్వామి కల్యాణం





కడప నగరంలోని మృత్యుంజయకుంట, రాజరాజేశ్వరీ దేవీ ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం



పొలతలలో కోనేటిలో స్నానం చేస్తున్న వృద్ధులు



చక్రాయపేట..శివపార్వతుల, లక్ష్మీవేంకటేశ్వరుల కల్యాణం, పాల్గొన్న భక్తులు







కడప నగరంలోని మృత్యుంజయకుంటశివాలయం, చెన్నూరు..శివాలపల్లె కాశీవిశ్వేశ్వరాలయంలో నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణానికి హాజరైన మహిళలు, వీరపునాయునిపల్లె...అన్నదాన కార్యక్రమంలో భక్తులు

గంగమ్మ ఆలయ వార్షిక వేడుకలకు ఎమ్మెల్యే హాజరు

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తలపనూరు గ్రామంలో ఉన్న గంగమ్మ ఆలయంలో 32వ వార్షిక వేడుకలకు బుధవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హాజరయ్యారు. నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు ఉమామహేశ్వరశర్మ పర్యవేక్షణలో పుత్తా కృష్ణచైతన్య రెడ్డి చేతులమీదుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ముందుగా నాయకులు నాగిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, మారుతిరెడ్డి, గంగిరెడ్డితో కలిసి ఘనంగా ఎమ్మెల్యేకి స్వాగతంపలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు





శిల్పారామంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని శిల్పారామంలో బుధవారం మహాశివరాత్రి సందర్భం గా ఏర్పాటుచేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో వేంపల్లె సంసిద్ సతీష్‌రెడ్డి స్కూల్ విద్యార్థులచే నృత్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. శాస్త్రీయ, సినిమా పాటలకు వేసిన నృత్యం ఆకట్టుకోవడంతో సందర్శకులు ఈలలు, చప్పట్లతో ప్రోత్సహించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేద్దాం

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబే డ్కర్ ఆశయ సాధనకు కృషిచే ద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని నగరిగుట్టలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం మొదటి వార్షికోత్సవ కార్యక్రమం దళిత ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ చెన్నయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దళిత ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య

ఆధ్యాత్మికశోభతో అలరారిన జ్యోతిర్లింగాల ప్రదర్శన



జ్యోతిర్లింగాల ప్రదర్శన తిలకిస్తున్న నాయకులు

కడప కల్చరల్, ఫిబ్రవరి 26, (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని నగర ఓం శాంతినగర్ బ్రహ్మకుమారీస్ ఆంధ్ర-కర్ణాటక సబ్‌జోన్ అదనపు ఇన్‌చార్జ్ రాజయోగిని గీత దీది ఆధ్వర్యంలో బుధవారం ఓం శాంతినగర్ సేవా కేంద్రంలో భారతదేశంలో ఉన్న జ్యోతిర్లింగాల ప్రదర్శన భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంతం సరికొత్త ఆధ్యాత్మికశోభతో అలరారింది. బ్రహ్మకుమారీస్ వారి ఆహ్వానం మేరకు ప్రదర్శన తిలకించిన బీసీ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాసా కోదండరామ్, వాల్మీకి సంఘం నాయకులు శ్రీనివాసులు, పారిశ్రామికవేత్త సంపత్‌కుమార్‌జైన్ సరికొత్త ఆధ్యాత్మిక ఆనందపారవశ్యం పొందారు.ఈనెల 26 నుంచి 28వరకు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరి, ప్రదీప, కావ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు ప్రవహించేదెలా..?



కడప నగరంలోని నాగరాజుపేట, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పడిపోయిన మురుగుకాల్వ. కార్పొరేషన్ అధికారులు సక్రమంగా చెత్త ఎత్తకపోవడం వల్ల మురుగుకాల్వల్లో చెత్త నిండుకొని మురుగు ప్రవహించలేదు.

కడప సెవెన్ రోడ్స్, (ఆంధ్రజ్యోతి)


శంభో... శివ శంభో

● శివనామస్మరణతో మారుమోగిన కొండా కోనలు ● శివాలయాలకు పోటెత్తిన భక్తులు ● కనుల పండువగా స్వామివారి కల్యాణం


బద్వేలు: ఓంకారేశ్వరస్వామి ఆలయంలో..


ప్రొద్దుటూరు: ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో సైకత లింగం


ఖాజీపేట: ప్రత్యేక అలంకరణలో నాగనాథేశ్వరుడు


రాజుపాలెం: భీమలింగేశ్వరుని దృశ్యం


జమ్మలమడుగు: కన్యతీర్థంలో భక్తుల క్యూ


మైదుకూరు: మాధవ రాయస్వామి ఆలయంలో శివలింగం


ఖాజీపేట: అప్పనపల్లెలో ప్రత్యేక అలంకరణలో శివుడి ప్రతిరూపం

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి. వేకువజాము నుంచే కైలాసనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉండడంతో రద్దీగా మారాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రొద్దుటూరుటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని శివాలయాలలో భక్తుల సందడి నెలకొంది. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ తంతు నిర్వహించారు. రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో సైకత లింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి, చండీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకతలింగం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, నవరత్న లింగానికి కాశీజలాలతో భక్తులు అభిషేకాలు చేశారు. అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

బద్వేలు/బద్వేలుటౌన్: లంకమల అభయారణ్యంలో వెలసిన ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ఆవరణలో దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి స్వామివారి కల్యాణం నిర్వహించి ఆలయ ఆవరణలోని కోనేరులో తెప్పోత్సవం నిర్వహించారు. అలాగే పట్టణంలోని నాగులకట్ట చెరువు వద్ద వెలసిన పురాతన శివాలయం, రూపరాంపేట శివానందస్వామి ఆలయంలో, చెన్నంపల్లెలోని భవాని సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో, అనంతగిరి క్షేత్రంలోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో, దత్తసాయిబాబా ఆలయ ప్రాంగణంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

లంకమలలో ప్రత్యేక పూజలు

లంకమల అభయారణ్యంలో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి, కైవల్య దంపతులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


బద్వేలు: లంకమలలో స్వామివారి దర్శనానికి క్యూలైనులో ఉన్న భక్తులు

ఖాజీపేట: మండల పరిధిలోని అగ్రహారం శివాలయం, తీర్థాల్లో వెలసిన శివుడు, అప్పనపల్లె శివాలయంలో, నాగనాథేశ్వరునికి శివరాత్రిని పురష్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం కొండ కింది భాగంలో భక్తులకు ఆర్యవైశ్య సంఘం సభ్యులు అన్నదానం, శివతాండవం, మిమిక్రీ ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు రాత్రి అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తుల కోసం ప్రభుత్వం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరాన్ని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో సగిలి రవిబాబు తనిఖీ చేశారు.

బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞానకర్త మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో రెండు రోజులుగా మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గోవిందమాంబ - వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి ఏపీ దేవదాయశాఖ తరపున కదిరి శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనరు శ్రీనివాసులరెడ్డి, వేమనపీఠం యోగివేమన వంశస్తులు వేమారెడ్డి, వేదపండితుల ఆధ్వర్యంలో హిందూ సంప్రదాయం ప్రకారం స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన వేదపండితులు ఘనంగా చేపట్టారు. ఈ మహోత్సవంలో పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మఠం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ, మేనేజరు ఈశ్వరయ్యాచారి, పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

జగన్నాథ ఈశ్వరీదేవి అమ్మవారి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలను చేపడుతున్నారు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. ఉదయం 11గంటలకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణమూర్తులకు తులాభారం చేపట్టారు. సాయంత్రం కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

దువ్వూరు: మల్లెంగుండెంలో కొలువైన మహేశ్వరుని దర్శనానికి కొండల్లో నడక దారిన భక్తులు వ్యయప్రయాసల కోర్చి దర్శనం చేసుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం శివాలయాలు పలు ప్రాంతాల్లో కిటకిటలాడాయి. వనిపెంట, నీలాపురం ఫారెస్టు పరిధిలోని నల్లమల్ల అటవీ ప్రాంతం మల్లెం గుండెంలో కొలువైన మల్లేశ్వరుని కొలిచే భక్తులు అధికంగా ఉన్నారు. అలాగే దువ్వూరులోని భీమలింగేశ్వర ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

రాజుపాలెం: మహాశివరాత్రి సందర్భంగా బుధవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వెల్లాల పుణ్యక్షేత్రంలో ఉన్న భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు కనువిందు చేశారు. టంగుటూరు, అర్కటవేముల, రాజుపాలెం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ముద్దనూరు: మండల పరిధి బొందలకుంట బసవేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివునికి, బసవేశ్వరునికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు చేశారు. పార్వతీ సమేత బసవేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పాల్గొన్నారు.

కొండాపురం: మండలంలో బుధవారం శివరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రసిద్ధ శైవక్షేత్రమైన బాలప్పకోనలో శివపార్వతులకు ఉదయం కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు మిట్టాబాలభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఎర్రగుంట్ల: మహాశివరాత్రి వేడుకలు మండలంలో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి శివాలయాలు అభిషేకాలతో కిటకిటలాడాయి. ఐసీఎల్‌లోని ఉమామహేశ్వరాలయంలో స్వామివారికి భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మైలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అగస్త్యేశ్వరస్వామి కోన, త్రిమూర్తుల కోనలతో పాటు మైలవరం, చిన్నకొమెర్ల, కరమలవారిపల్లె, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కడప మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వర్లు దంపతులు, త్రిమూర్తుల కోనలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిలు పాల్గొని శివునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జమ్మలమడుగు: మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కన్యతీర్థం బాలత్రిపుర సుందరీదేవి, సుందరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తులు కిటకిటలాడారు. ఆలయం ఎదురుగా మహిళలు దీపాలు వెలిగించి మొక్కుబడులు చెల్లించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు, అన్నదానం జరిగాయి.

ప్రొద్దుటూరురూరల్: మండల పరిధిలో నంగనూరుపల్లె గ్రామంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారురెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే వీరభద్రస్వామిని, శివుని, భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ట్రైనీ డీఎస్పీ భవాని, మైదుకూరు సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య, దేవస్థానం చైర్మన్ వీరనారాయణ ఉత్సవాలను పర్యవేక్షించారు. బద్వేలు డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేషు వైద్య శిబిరాన్ని పరిశీలించారు.

మైదుకూరు రూరల్: మండలంలోని భైరవకోన, గణపతి నగర్‌లోని శివాలయం, ముక్కొండ మల్లేశ్వరుడు, లక్ష్మీ మాధవరాయ స్వామి ఆలయం, పార్వతీనగర్‌లోని శివాలయాల్లో మహా శివరాత్రి పండగను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు.

అట్లూరు: కొండూరులో వీరభద్రస్వామి, అట్లూరు శివాలయంలో శివునికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కమలకూరు, ముత్తుకూరు, వరికుంట్ల, చెండువాయి గ్రామాల్లోని ఆలయాలు కిక్కిరిశాయి.

గోపవరం: మండల పరిధిలోని మల్లెంకొండేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి గణపతిపూజతో ప్రారంభించి మధ్యాహ్నం 3గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయం వద్ద కంట్రోల్ రూముతో పాటు మెడికల్ క్యాంపు కూడా ఏర్పాటు చేశారు.

పోరుమామిళ్ల: మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. బుధవారం రాత్రి మద్దిమాను గురప్పస్వామి ఆలయంలో బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్నలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బి.కోడూరు: మండలంలో బుధవారం శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మున్నెల్లి గ్రామం సగిలేటి వడ్డున వెలసిన పురాతన శివాలయంలో అలాగే మేకవారిపల్లె గ్రామ సమీపాన వెలసిన 108 శివలింగాల దగ్గర భక్తులు విరివిగా పాల్గొన్నారు.

కాశినాయన: మండలంలోని జ్యోతిక్షేత్రంతో పాటు చెన్నవరం, కనెకలగుండం, వరికుంట్ల, అక్కంపేట తదితర గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.


మైలవరం: అగస్త్యేశ్వరస్వామి కోనలో పూజలు చేస్తున్న జిల్లా మొదటి అదనపు జడ్జి వెంకటేశ్వర్లు దంపతులు


బద్వేలు: లంకమల క్షేత్రంలో హోమం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డి దంపతులు


బి.మఠం: గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


ఎర్రగుంట్ల: పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం


ప్రొద్దుటూరు: స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


ముద్దనూరు: కల్యాణోత్సవంలో పాల్గొన్న తులసిరెడ్డి


చాపాడు: వీరభద్రస్వామి ఆలయంలో క్యూలో భక్తులు

వైన్‌షాపు వద్ద ఘర్షణ- కేసు నమోదు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీరోడ్డులో ఉన్న ఓ వైన్‌షాపు వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. పట్టణానికి చెందిన అతిక్, చియా, షామీర్‌లు మద్యం తాగేందుకు వచ్చారు. తమ బైకుకు అడ్డంగా మరో బైకు ఉండడంతో వీరశ్రీకాంత్, బాలాజీలతో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో చియా తన వద్ద ఉన్న కత్తితో వారిపై దాడి చేయడానికి ప్రయత్నించగా పక్కనున్న వ్యక్తులు అడ్డుకున్నారు. ఈ ఘర్షణలో వీరశ్రీకాంత్‌తో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు.

రేపు గంగమ్మ, పాలేటమ్మ తిరునాళ్లు

ముద్దనూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొందలకుంట గ్రామంలో గురువారం సాయంత్రం గంగమ్మ, పాలేటమ్మ తిరునాళ్లు నిర్వహిస్తున్నట్లు గుడి ధర్మకర్త సుబ్బరాయుడు తెలిపారు. ప్రతి ఏటా శివరాత్రి పర్వదినం మరుసటి రోజున తిరునాళ్లు నిర్వహిస్తారు. గుడిని ముస్తాబు చేసి సిద్ధం చేశారు. గుడి ప్రాంగణంలో వేసవిలో కూడా నీరు ఎండిపోని కుంట ఉంది. మండలంలోని గ్రామ ప్రజలే కాకుండా ఇతర మండలాల నుంచి భారీ జనం తరలివస్తారు. ఇక్కడి అమ్మవార్లను దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మకం.

ముద్దనూరులో శాఖాహార ర్యాలీ

ముద్దనూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోస్టాఫీస్ సమీపంలో బుధవారం పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా సాయంత్రం గ్రామంలో శాఖాహార ర్యాలీ చేపట్టారు. చిన్నారులు కోలాటం చేశారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారు ప్లకార్డులు పట్టుకొని శ్వాస మీద ధ్యాస పెడితే ఆరోగ్యంగా ఉండవచ్చని, శాఖాహారులుగా మారాలని నినాదాలు చేశారు.

పేదలకు పట్టాలు మంజూరు చేయాలి

బద్వేలురూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట సమీపంలో పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉన్న చోటనే వారికి ఇంటి పట్టాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లేవాకు నాగసుబ్బారెడ్డి కోరారు. సీపీఐ కాలనీవాసులు చేస్తున్న దీక్షలు బుధవారానికి 6వ రోజుకు చేరుకున్నాయి. వారికి సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడుతూ 8 నెలలుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, సుబ్బరాయుడు, రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్, బాలు, వెంకటరమణ పాల్గొనగా, దీక్షల్లో విజయకుమారి, దేవీకృప, ప్రసాద్‌తో పాటు 39 మంది పాల్గొన్నారు.

పండుగలు వస్తేనే పదికాసులు




తోటలో పూలు కోస్తున్న కూలీలు, (ఇన్‌సెట్లో) కనకాంబరాలు

● పూల రైతులకు కాస్త ఊరట

రాజుపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే పూల రైతులకు పండుగలు, పెళ్లిళ్లు వస్తేనే పదికాసులు వస్తాయని లేదంటే కూలీల డబ్బులు కూడా రావని పూల రైతులు ఆవేదన చెందుతున్నారు. శివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం, బుధవారం పూలకు గిరాకీ పెరిగింది. కాగడాలు కేజీ రూ.300, మల్లెలు కేజీ రూ.400, కనకాంబరాలు కేజీ రూ.600 అమ్మడంతో రైతన్నలకు కాస్త ఊరట లభించింది. కౌలు చెల్లించే పూల తోటలు సాగు చేస్తున్న రైతన్నలకు వేసవి మొదలు కావడంతో పూల దిగుబడి వస్తున్నా సరైన గిట్టుబాటు ధర లేక పోవడంతో నిరాశకు గురవుతున్న రైతన్నలకు కాస్త ఊరట లభించింది. మండలంలోని టంగుటూరు, దువ్వూరు మండలంలోని కానగూడూరు, బయనపల్లె, క్రిష్ణంపల్లె, జిల్లెల్ల గ్రామాల్లో కుందూ, బోర్ల కింద దాదాపు 200 ఎకరాలకు పైబడి పూలతోటలు సాగులో ఉన్నాయి. నిత్యం కానగూడూరు మార్కెట్ నుంచి వెయ్యి- 2వేల కిలోల వరకు వివిధ పట్టణాలకు పూలను తరలిస్తుంటారు. అయితే కిలో రూ.80 పలికే ధరల్లో కూలీకి రూ.200 చెల్లిస్తే కేవలం ఒక కూలీ 2 కేజీ నుంచి 3 కేజీలు కోస్తారని రైతులు తెలిపారు. దీంతో కూలీ డబ్బులు మాత్రమే వచ్చేదని, పండుగలు రావడంతో కాస్త ఊరట లభించిందన్నారు. పూలతోటల్లో నిత్యం పూలు కోస్తేనే తప్ప మరుసటిరోజు పూలు రావనిరైతులు తెలిపారు. ఏదేమైనా పండుగలు, పెళ్లిళ్లు వస్తేనే పదికాసులు వస్తాయన్నారు. ఎకరాకు 10 నుండి 15 కేజీల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.

హార్టికల్చర్ ద్వారా సబ్సిడీ అందించండి

పూల తోటలు పెంచేందుకు ప్రభుత్వం హార్టికల్చర్ ద్వారా సబ్సిడీకి మందులు అందించడం ద్వారా కాస్త మేలు జరుగుతుందని, అదే విధంగా ప్రైవేటు మార్కెట్ లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా మార్కెట్ ఏర్పాటు చేయాలని పలువురు రైతులు తెలిపారు.

కంకర వేశారు.. రోడ్డు మరిచారు..

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దనూరు రోడ్డు సున్నపురాళ్లపల్లె, కన్నెతీర్థం వెళ్లే దారిలో కొన్ని చోట్ల రోడ్డు పనులు చేసేందుకు కంకర పరిచారు. గత 40 రోజుల నుంచి రోడ్డు పనులు మాత్రం చేయలేదని సున్నపల్లె గ్రామానికి చెందిన వాహనదారులు, ఆ దారిన వెళ్లే ప్రజలు వాపోయారు. ప్రస్తుతం కన్యతీర్థంలోని ఆలయ చైర్మన్ శివనాథరెడ్డి.. కాంట్రాక్టు సిబ్బందితో త్వరగా రోడ్డు వేయాలని మహాశివరాత్రికి ప్రజలు తిరగాలన్నా ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పినట్లు తెలిసింది. అయినా కొన్ని చోట్ల రోడ్డుపై కంకరపరచి ఇప్పటికి రోడ్డు పనులు చేయలేదు. దీంతో వాహనదారులు ఆ ప్రాంతానికి వెళ్లే వారు ఇక్కట్లకు గురవుతున్నారు. త్వరగా రోడ్డు వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.



జగన్ దృష్టికి పలు సమస్యలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు పలువురు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని పులివెందులలోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ సమస్యలపై ఆరా తీసినట్లు తెలిసింది. అలాగే బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి తదితరులు సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

స్టైఫండ్ పెంచి న్యాయం చేయాలి


కళాశాల ఆవరణంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పశువైద్య కళాశాల విద్యార్థుల స్టైఫండ్‌ను పెంచాలనే న్యాయపరమైన డిమాండ్‌పై ప్రభుత్వం వెంటనే స్పందించాలని విద్యార్థులు పేర్కొన్నారు. బుధవారం 24వ రోజు సమ్మెలో భాగంగా కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన నిరవధిక సమ్మె శిబిరంలో కూర్చొని నిరసన తెలిపారు.

బండలాగుడు పోటీలు

మైలవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండుగను పురష్కరించుకుని లింగాపురం పంచాయతీలోని త్రిమూర్తుల కోనలో బుధవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. రసవత్తరంగా సాగిన రాయలసీమ సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. గెలుపొందిన వారికి జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.15 వేలను ఆయన చేతుల మీదుగా అందజేశారు.